క్లుప్తంగా

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

నెల్లూరు సిటీ: ది పీడీటీ వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌కు గుర్తింపునిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్ 123 విడుదల చేయడంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కేపీరెడ్డి గురువారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని కొనియాడారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి 52వేల మంది ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా సర్వీసును 62 ఏళ్లకు పెంచారని చెప్పారు. సీఎం జగన్‌కు ఆర్టీసీ ఉద్యోగులు జీవితాంతం రుణపడి ఉంటారని పేర్కొన్నారు.

పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడిగా వేణుగోపాల్


శాఖవరపు వేణుగోపాల్

నెల్లూరు సిటీ: సీపీ అండ్ పీహెచ్‌పీ డబ్ల్యూఏ జిల్లా అధ్యక్షుడిగా శాఖవరపు వేణుగోపాల్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్రాధ్యక్షుడు తోరాటి ప్రభాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు గురువారం ప్రకటించారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా జయప్రకాష్, న్యాయ సలహాదారురాలిగా రమాదేవి, ఉపాధ్యక్షులుగా షేక్ సత్తార్, ప్రధాన కార్యదర్శిగా గోరంట్ల శేషయ్య, ఉపకార్యదర్శిగా నంద్యాల మాలిని, కోశాధికారిగా డీ శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులుగా నెల్లూరు డివిజన్ నుంచి ప్రసాద్, రామదాసు, వీరయ్య, కావలి డివిజన్ నుంచి పీవీ రమణయ్య, మస్తానయ్య, జిలానీబాషా, ఎం దయాకర్‌రావు, చలపతిరావు, ఆత్మకూరు డివిజన్ నుంచి వెంకటేశ్వర్లు , షేక్ అబ్దుల్ వహాబ్, జగన్‌మోహన్‌రావు, మహేష్, పద్మావతి, గూడూరు , నాయుడుపేట డివిజన్ల నుంచి శేఖర్, సాయి, మురళి సుబాష్ చంద్రబోస్, ఖలీల్, శంకరమ్మ ఎన్నికైనట్లు తెలిపారు.

పేదింటి ఆడబిడ్డలకు అండగా జగనన్న


ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): పేదింటి ఆడబిడ్డలకు గౌరవప్రదంగా వివాహాలు జరిపించాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా పథకాలను అమలు చేస్తూ అండగా నిలుస్తున్నారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. గురువారం సీఎం వైఎస్ జగన్ వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా నాల్గో విడత సాయాన్ని విడుదల చేయడంపై ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా కింద ఆత్మకూరు నియోజకవర్గంలో అనంతసాగరం మండలంలో 10, ఏఎస్‌పేట 10, ఆత్మకూరు మండలం 11, మున్సిపాలిటీలో 2, చేజర్ల 4, మర్రిపాడు 9, సంగం 6 జంటలు లబ్ధిపొందినట్లు వివరించారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి



నెల్లూరు(క్రైమ్): బైక్ ఢీకొనడంతో పాదచారుడు మృతి చెందిన ఘటన ప్రశాంతినగర్ జంక్షన్ వద్ద గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే.. జాతీయ రహదారిపై గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి(32) కావలి వైపు నడుచుకుంటూ వెళుతుండగా, ప్రశాంతినగర్ జంక్షన్ వద్ద వెనుకగా వేగంగా వచ్చిన బైక్ ఢీకొని వెళ్లింది. ఈ ఘటనలో తీవ్రగాయాల పాలైన పాదచారుడు అక్కడికక్కడే మృతిచెందాడు. నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శివాజీరాజా తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. దీంతో మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. నార్త్ ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 94407 00095 నంబర్‌ను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ విజ్ఞప్తి చేశారు.

క్యాట్‌ఫిష్ అక్రమ రవాణా అడ్డగింత

నెల్లూరురూరల్: నెల్లూరు రూరల్ మండలంలోని నెల్లూరు–మైపాడు రోడ్డులో మూడోమైలు వద్ద నిషేధిత క్యాట్‌ఫిష్‌లను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని మత్స్యశాఖ ఏడీ ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు గురువారం రాత్రి పట్టుకున్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకునినెల్లూరు రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. క్యాట్‌ఫిష్‌కు ఇతర రాష్ట్రాల్లో డిమాండ్ ఉండడంతో కొందరు వ్యక్తులు అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిసింది. వాహనంలో 8 టన్నుల వరకు క్యాట్ ఫిష్ ఉన్నట్లు సమాచారం. స్వాధీనం చేసుకున్న క్యాట్‌ఫిష్‌లను రెవెన్యూ అధికారుల సమక్షంలో శుక్రవారం ఖననం చేయనున్నారు.

పీసీసీ అధ్యక్షుడికి సన్మానం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విజయవాడలోకాంగ్రెస్ పార్టీ రాష్ట్రాధ్యక్షుడు (పీసీసీ) గిడుగు రుద్రరాజును జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి ఏడాది కాలం పూర్తయిన సందర్భంగా బాలసుధాకర్‌ను శాలువాతో సత్కరించారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి


సంక్షేమ పథకాల వివరాలతో కూడిన ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న ఎంపీ ఆదాల

నెల్లూరు రూరల్: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రూరల్ మండలం పెనుబర్తిలో గురువారం నిర్వహించిన 'ఏపీకి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమంలో ఎంపీ పాల్గొని మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధితో పాటు అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. ఎన్నికల హామీలను వందశాతం నెరవేర్చడమే కాకుండా సచివాలయ వ్యవస్థ ద్వారా గడప గడపకు సంక్షేమ ఫలాలు చేరవేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని తెలిపారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయితే అన్ని వర్గాలకు మరింత లబ్ధి చేకూరుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ఇప్పటి వరకు జరిగిన లబ్ధిని వివరించాలని సూచించారు. టీడీపీ వైఫల్యాలు, బూటకపు హామీలను ప్రజలకు వివరించి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు సమష్టిగా కృషిచేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ తరపున ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యేగా తాను ఎన్నికల్లో పోటీ చేయడం జరుగుతుందని, అత్యధిక మోజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సచివాలయంలో సంక్షేమ లబ్ధి వివరాలతో కూడిన ఫ్లెక్సీని ఎంపీ ఆవిష్కరించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, మేయర్ స్రవంతి, ఎంపీపీ విజయకుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాంప్రసాద్‌రెడ్డి, ఉపసర్పంచ్ వెంకటేశ్వర్లురెడ్డి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

• కలెక్టర్ హరినారాయణన్


మాట్లాడుతున్న బంగార్రాజు

నెల్లూరు(పొగతోట): కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గానూ ఈ నెల 26 నుంచి జనవరి 26 వరకు జిల్లాలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను నిర్వహించనున్నారని కలెక్టర్ హరినారాయణన్, యాత్ర పర్యవేక్షణాధికారి బంగార్రాజు పేర్కొన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై జెడ్పీ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని 722 పంచాయతీల్లో యాత్రను చేపట్టనున్నారని, దీనికి సంబంధించిన రూట్‌మ్యాప్‌ను రూపొందించాలని అధికారులకు సూచించారు. మండల స్థాయిలో ఎంపీడీఓలను నోడల్ అధికారులను నియమించామని వెల్లడించారు. అనంతరం బంగార్రాజు మాట్లాడారు. యాత్రకు సంబంధించి ఆరు ఎల్‌ఈడీ స్క్రీన్లున్న వాహనాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఆయుష్మాన్ భారత్ కార్డుల నమోదు, పేదలకు గృహాలు తదితర పథకాలు సంపూర్ణంగా అందేలా చర్యలు చేపడతామని చెప్పారు. యాత్ర నిర్వహణకు జిల్లా స్థాయిలో చైర్మన్‌గా కలెక్టర్, సభ్యులుగా 36 శాఖల జిల్లా అధికారులు ఉంటారన్నారు. జిల్లా నోడల్ ఆఫీసర్‌గా డీఆర్డీఏ పీడీ వ్యవహరించనున్నారని పేర్కొన్నారు. కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్, ట్రెయినీ కలెక్టర్ సంజనాసిన్హా, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, డీపీఓ సుస్మిత, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, పరిశ్రమల శాఖ జీఎం సుధాకర్‌రావు, వ్యవసాయ శాఖ అధికారి సత్యవతి, ఎల్డీఎం శ్రీకాంత్ ప్రదీప్‌కుమార్, డీఎఫ్‌ఓ చంద్రశేఖర్‌రావు, డీఈఓ గంగాభవాని, ఐటీడీఏ పీఓ మందా రాణి, డ్వామా, హౌసింగ్ పీడీలు వెంకట్రావ్, నాగరాజు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించండి

నెల్లూరు(బారకాసు): కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించి అర్హులందరికీ లబ్ధి చేకూర్చాలని వార్డు సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లకు కేంద్ర యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ విభాగ డైరెక్టర్ బంగార్రాజు సూచించారు. నగరంలోని 8వడివిజన్ ముకుందాపురం, విజయగోపాలపురం, సీఆర్పీ డొంక ప్రాంతాల్లోని వార్డు సచివాలయాలను గురువారం ఆయన కార్పొరేషన్ అదనపు కమిషనర్ శర్మదతో కలిసి సందర్శించారు. కార్పొరేషన్ సెక్రటరీ హేమవతి, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆడ పిల్లల సంరక్షణ అందరి బాధ్యత


మాట్లాడుతున్న డెమో అధికారి శ్రీనివాసరావు

నెల్లూరు సిటీ: ఆడ పిల్లల సంరక్షణ అందరి బాధ్యతని జిల్లా వైద్యారోగ్యశాఖ డెమో అధికారి బీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో ఆడ పిల్లల సంరక్షణపై ఆరోగ్య కార్యకర్తలు, సూపర్‌వైజర్లకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడ పిల్లలను చదివించడం, రక్షించుకోవడం ద్వారా సమాజ మనుగడను కాపాడుకోవచ్చన్నారు. బాల్యవివాహాలు జరగకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. బాలికలను చదివించి వారికి ఉజ్వల భవిష్యత్ అందించాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, చట్టానికి వ్యతిరేకంగా ఎవరైనా నడుచుకుంటే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో హెచ్‌ఈఈఓ బీ నరసింహారావు, డీపీఓ బీ రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా పోతనామాత్యుని సాహిత్యసభ


పోతన, సత్యసాయి చిత్రపటాలకు పుష్పాంజలి

నెల్లూరు(బృందావనం): పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం సమావేశ మందిరంలో నెల్లూరు వర్ధమాన సమాజం, శ్రీరామకృష్ణ వివేకానంద భావ ప్రచార సమితి వేదాయపాళెం శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మహాకవి పోతనామాత్యుని సాహిత్య సభ, భగవాన్ శ్రీసత్యసాయిబాబా జయంతి సభను గురువారం నిర్వహించారు. యువవక్త కాకు మురళీరెడ్డి మహాకవి పోతనామాత్యుడు రచించిన 'పోతన–భాగవతం'పై ప్రసంగించారు. శ్రీరామకృష్ణ వివేకానంద భావప్రచార సమితి సభ్యుడు శమంత్‌కుమార్ భగవాన్ సత్యసాయిబాబా సేవాతత్పరతను వివరించారు. తొలుత మహాకవి పోతన, భగవాన్‌సత్యసాయిబాబా చిత్రపటాలకు పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేసి పుష్పాంజలి సమర్పించారు. నెల్లూరు వర్ధమాన సమాజం కార్యదర్శి మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి, కాశీప్రసాద్, గిరి, పుట్టాశేషు, పద్మాకర్ పాల్గొన్నారు.

27లోగా డీబీటీ ప్రక్రియను పూర్తి చేయాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వ్యవసాయ విద్యుత్ నగదు బదిలీ పథకం(డీబీటీ)కు సంబంధించి జిల్లాలోని రైతుల బ్యాంక్ ఖాతాల వివరాలను ఈ నెల 27లోగా ఆన్‌లైన్‌లో పొందుపరచాలని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ వీ విజయన్ జిల్లా విద్యుత్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన నగరంలోని విద్యుత్ భవన్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా విద్యుత్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. డీబీటీకి సంబంధించి అర్హత కలిగిన జిల్లా రైతుల వివరాలు, వారి బ్యాంకు ఖాతాల వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపరచాలని ఏఈలను ఆదేశించారు. ఇప్పటి వరకు పొందుపరిచిన కొందరు రైతుల బ్యాంకు ఖాతాలు వినియోగంలో లేవన్నారు. అలాంటి రైతులకు సంబంధించి కొత్త ఖాతాల వివరాలను సేకరించి మళ్లీ పొందుపరచాలని సూచించారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో ఏపీఎస్పీడీసీఎల్ తిరుపతి కార్పొరేట్ కార్యాలయ చీఫ్ జనరల్ మేనేజర్ రాజధర్మజ్ఞాని పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సంస్థకు సబ్సిడీ కింద యూనిట్‌కు రూ.8.12 చెల్లిస్తోందన్నారు. జిల్లాకు చెందిన ఏఈలు రైతుల వద్దకు నేరుగా వెళ్లి వారికి మ్యాండేటరీ ఫారం అందజేసి అందులో వారి ఆధార్, బ్యాంకు ఖాతా నంబర్లను సేకరించి అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో సీనియర్ అకౌంట్ ఆఫీసర్ మురళి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పరంధామయ్య, జిల్లాకు చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లు, జూనియర్ అకౌంట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

జానపద కళలను కాపాడుకుందాం


జ్యోతిప్రజ్వలన చేస్తున్న కళాకారులు

నెల్లూరు(బృందావనం): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పునరుజ్జీవింపజేసే జానపద కళలను కళాకారులు కాపాడుకోవాలని కళా సంస్థల నిర్వాహకులు పిలుపునిచ్చారు. రాష్ట్ర సాంస్కృతికశాఖ సౌజన్యంతో ప్రజాజ్యోతి చైతన్య కళావేదిక ఆధ్వర్యంలో పురమందిరంలో 'జగనన్న దళిత డప్పుల మేళా' కార్యక్రమాన్ని రెండోరోజూ గురువారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా ప్రజాజ్యోతి చైతన్య కళావేదిక రాష్ట్ర చైర్మన్ కే రమణశ్రీ, జిల్లా కార్యదర్శి వెంకటాద్రి, జానపద కళావేదిక జిల్లా అధ్యక్షుడు వీ చక్రపాణి, వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు నెల్లూరు బాబు, సీనియర్ రంగస్థల నటి రేబాల శ్రీలక్ష్మి, జగనన్న దళిత డప్పుల మేళా కార్యనిర్వాహకుడు మంద వెంకటరావు మాట్లాడారు. దేశ సంస్కృతి అంతరించిపోకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర సాంస్కృతికశాఖ సహకారంతో కళలను ప్రోత్సహిస్తున్న తీరు మరువలేమన్నారు. జగనన్న డప్పుల మేళా ముగింపు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు తెలిపారు. మేళాలో పాల్గొన్న కళాకారులకు మహాకవి గుర్రం జాషువా ప్రతిభ పురస్కారాలను అందజేయనున్నట్లు చెప్పారు. జిల్లాకు చెందిన సీనియర్ కళాకారులతో బాలనాగమ్మ, సత్యహరిశ్చంద్ర నాటకాలు, కళలను ప్రదర్శించారు. సీనియర్ కళాకారులు నెల్లూరు భానుమతి, సింగరాయకొండ పద్మ, సులోచనమ్మ, విమలమ్మ, ఎంబేటి జయరాజు, భద్రాచలం బాబు, తల్లు శీనయ్య డప్పులబృందం, ప్రముఖ హార్మోనిస్టు తిరుపాల్‌రెడ్డి, శ్రీహరి, వెంకటాద్రి, కామాక్షి పాల్గొన్నారు.

వైభవంగా పవిత్రోత్సవాలు



నెల్లూరు రూరల్: రూరల్ మండలం, నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. రెండోరోజు గురువారం శ్రీవారు, ఆదిలక్ష్మీదేవికి విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. ఆగమ విద్వాన్ సత్యనారాణచార్యుల బృందంతో పాటు ఆలయ ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు పవిత్రోత్సవాల విశిష్టతను భక్తులకు ప్రవచించారు. ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, పాలక మండలి సభ్యులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

బీజేపీ యువమోర్చా నూతన కార్యవర్గ నియామకం

నెల్లూరు(మినీబైపాస్): భారతీయ జనతా పార్టీ యువమోర్చా నూతన కార్యవర్గాన్ని నియమించినట్లు ఆ పార్టీ జిల్లా కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఉపాధ్యక్షులుగా నెల్లూరు సిటీకి పీ సాయికృష్ణ, నెల్లూరురూరల్‌కు అడపాల మదన్‌సాయిరెడ్డి, ఆత్మకూరుకు మాచిరాజు వెంకటేశ్వర్లు, కోవూరుకు ఎరువు హరిప్రసాద్ నియమితులయ్యారు. అలాగే జనరల్ సెక్రటరీలుగా నెల్లూర సిటీకు నరేష్ మురుగ, కావలికి నవీన్‌కుమార్, సెక్రటరీలుగా ఆత్మకూరుకు తలచెరు తిరుపతి నాయుడు, నెల్లూరురూరల్‌కు బల్లవోలు సందీప్, కందుకూరుకు జలగం అశోక్‌కుమార్, కోవూరుకు గంధి పెంచల కృష్ణ, కావలికి కృష్ణసాయినాయుడు, ట్రెజరర్‌గా ఉదయగిరికి మూలె బాలకృష్ణను నియమించారు.

ఐఆర్డీఏ పద్ధతిలో రీడింగ్ తీయాలి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ బిల్లులకు సంబంధించి మీటర్ రీడింగ్‌ను ఐఆర్డీఏ పద్ధతిలోనే తీయాలని నెల్లూరు టౌన్–2 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మధుసూదన్‌రెడ్డి ఆదేశించారు. నగరంలోని కిసాన్‌నగర్‌లోని విద్యుత్ సెక్షన్ కార్యాలయంలో విద్యుత్ సిబ్బందితో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి నెలా 7వ తేదీ లోగా విద్యుత్ బిల్లులు తీసే ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుత్ బిల్లుల బకాయిలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణ లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అసిస్టెంట్ ఇంజినీర్ విజయ్‌కుమార్, లైన్‌ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మన్లు, జేఎల్‌ఎంలు పాల్గొన్నారు.

అన్నదానం

నెల్లూరు(బృందావనం): పాతమున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలోని పట్టణ నిరాశ్రయుల కేంద్రంలో ది పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జిల్లాశాఖ, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శేషయ్య, ట్రస్ట్ చైర్మన్ రసూల్,తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు వెంకటేశ్వరపురం విద్యార్థిని



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలోని విశ్వభారతి హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని ఎస్‌కే సుమయ ముస్కాన్ జాతీయ స్థాయి అండర్–14 బాలికల ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. విశాఖపట్నంలో గురువారం జరిగిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో సత్తాచాటడంతో సెలెక్టర్లు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

రైల్వే శాఖను కాపాడుకుందాం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రైల్వే శాఖను ప్రైవేటీకరించేందుకు సిద్ధపడ్డారని, ఈ ప్రక్రియను అడ్డుకుని భారత రైల్వే శాఖను కాపాడుకుందామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్, నగర కార్యదర్శి నాగేశ్వరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వే శాఖను బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీకరణ పేరుతో కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు యత్నిస్తుందని ఆరోపించారు. సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, సీఐటీయూ నాయకులు సుధాకర్, రాంబాబు, నాగూర్, సుబ్బారెడ్డి, అంకయ్య, రవి, చెంచులు, మురళి,లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ బకాయిల వసూళ్లను వేగవంతం చేయాలి

• కమిషనర్ వికాస్‌మర్మత్


రెవెన్యూ అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ పరిధిలో ఇంటి, కుళాయి, డ్రైనేజీ పనుల వసూళ్లను వేగవంతం చేయాలని కమిషనర్ వికాస్‌మర్మత్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం కమిషనర్ కార్పొరేషన్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దీర్ఘకాలికంగా కొన్ని అసెస్మెంట్ల బకాయిలు ఎందుకు వసూలు కావడం లేదని, భారీ బకాయిలకు సంబంధించిన కారణాలను వివరించాలని అధికారులను ప్రశ్నించారు. అందుకు అధికారులు డబుల్ ఎంట్రీ, నాట్ ట్రేస్‌బుల్ అసెస్మెంట్లుతో పాటు ఎంక్రోచ్‌మెంట్‌లో తొలగించిన అసెస్మెంట్ నంబర్లపై భారీ బకాయిలు ఉన్నాయని, అందువల్ల నిర్దేశించిన వసూళ్ల లక్ష్యాలను సాధించలేకున్నామని బదులిచ్చారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ దీర్ఘకాలిక పన్ను బకాయిలు ఉన్న డబుల్ ఎంట్రీ, నాట్ ట్రేసబుల్ అసెస్మెంట్ల నంబర్లపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి డబుల్ ఎంట్రీ, నాట్ ట్రేస్ అసెస్మెంట్లను తొలగించుటకు ప్రతిపాదనలు తయారు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రోడ్ల విస్తరణలో తొలగించిన ఇళ్లు, షాపుల అసెస్మెంట్ నంబర్లతో పాటు డిమాండ్‌ను తొలగించుటకు కౌన్సిల్ సమావేశంలో ఆమోదం పొందేందుకు తీర్మానం ఉంచాలని సూచించారు. సచివాలయాలకు నిర్దేశించిన లక్ష్యాలను అడ్మిన్ కార్యదర్శుల ద్వారా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ట్రెయినీ కలెక్టర్ సంజనాసింహా, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, రెవెన్యూ అధికారులు శ్రీనివాసులు, సమద్, రాజేశ్వరి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు కృష్ణకిషోర్, కృపాకర్, చినబాబు, కృష్ణంరాజు, శ్రీనివాసులు, సునీల్, పెంచలయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక లక్ష తులసీ పూజ


లక్ష తులసీ పూజ చేస్తున్న మహిళా భక్తులు


విశేషాలంకారంలో శ్రీవారు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : చిలుక ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని వెంకటేశ్వరపురంలోని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సామూహిక లక్ష తులసి పూజను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దేవదేవేరులను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 21 రకాల పుష్పాలతో పుష్పయాగాన్ని కనులపండువగా నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ఘనంగా సత్యసాయి జయంతి వేడుకలు


ఆత్మకూరు బస్టాండ్ వద్ద సత్యసాయి భక్తుల అన్నదానం


సత్యసాయి మందిరంలో పూలంగిసేవ

నెల్లూరు(బృందావనం): భారతీయ సనాతన ధర్మాన్ని విశ్వవ్యాప్తం చేసిన భగవాన్ సత్యసాయిబాబా ప్రపంచానికి ఆదర్శప్రాయుడని శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పేర్నపాటి శ్రీరామరాజు కొనియాడారు. పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజ సమావేశ మందిరంలో పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు ఆధ్వర్యంలో భగవాన్ సత్యసాయిబాబా 98వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత సత్యసాయి చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి స్మరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వ మానవాళికి శాంతి, ప్రేమ, భక్తి మార్గాలను బోధించి వారిని ఆ మార్గంలో నడిపించిన దైవాంశ సంభూతులు సత్యసాయిబాబా అని కొనియాడారు. అనంతరం వివిధ రంగాలకు చెందిన జీ లక్ష్మీనారాయణ, పీ మలయ్యస్వామి, లక్ష్మీశ్రీనివాసశర్మ, ఎస్ గోపాలరావు, కే వెంకారెడ్డి, కే వెంకటేశ్వర్లురాజు, ఎం రవీంద్ర, టీ ఏడుకొండలరాజుకు శ్రీసత్యసాయి సేవా పురస్కారాలను అందజేసి ఘనంగా సత్కరించారు. అనంతరం భక్తి పాటల పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన గాయకులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు మెట్టు రామచంద్రప్రసాద్, ఎస్వీ రమేష్ బాబు, రాచపాళెం రఘు, టీ వెంకటేశ్వర్లు, ఎం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


సత్యసాయి పురస్కారాల ప్రదానం

సత్యసాయి మందిరంలో..

నెల్లూరు(బారకాసు): గోమతినగర్‌లోని సత్యసాయి మందిరం(సాయి హృదయ)లో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సత్యసాయి 98వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మందిర గౌరవాధ్యక్షుడు మురళీకృష్ణ పర్యవేక్షణలో సత్యసాయి చిత్రపటాలను వివిధ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉయ్యాల సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయి భక్తులు, బాలవికాస్ చిన్నారులు తమ భక్తిభావంతో సత్యసాయిని కీర్తిస్తూ ఆలపించిన కీర్తనలతో మందిరంలో సాయి నామస్మరణ మారుమోగింది. అలాగే నగరంలోని పలు ప్రాంతాల్లో సత్యసాయి ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. ఆత్మకూరుబస్టాండ్ వద్ద దాదాపు 1000 మందికి అన్నదానం చేశారు. సమితి కన్వీనర్ కొండా శేషగిరిరావు పర్యవేక్షణలో నిర్వహించిన జయంతి వేడుకల్లో పలు ప్రాంత్రాలకు చెందిన సత్యసాయి భక్తులు, బాలవికాస్ చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.